# పురోగామి

## భమిడిపాటి జగన్నాథరావు

శేఖరానికి పల్లెటూళ్ళంటే ఓ విధమైన అసహనంతో కూడిన ఏవగింపు. ఆ పల్లెటూళ్ళూ, ఆ వాతావరణం, ఆ కక్షలూ, స్పర్థలూ, రొచ్చు బురద రాజకీయాలూ, స్కాండల్స్—ఇవన్నీ అతని కెంతో వెగటు. తన సంస్కారం, చదువు వీటన్నిటికీ ఎత్తున, ఎంతో ఎత్తున వుందని అతని నమ్మకం.

అందుకే అతనికి తల్లి మాటలు రుచించడం లేదు.

ఆఖరిసారిగా చెబుతున్నట్టు ఆవిడ అంది: "నువ్వు ఈ విషయంలో ఇంత మూర్ఖంగా వుంటావని ఏనాడూ అనుకోలేదు. నువ్వు అమెరికానుండి తిరిగి వస్తున్నావని తెలిసిన ఈ రెణ్ణెళ్ళనుండీ కంట్లో వత్తులు వేసుకు చూస్తున్నట్టుగా వుంది. ఏడెనిమిదిసార్లు ఇప్పటికే కబురు పంపింది. పెద్దది—అమ్మమ్మని చూసివస్తే నీదేం పోతుందో నాకర్థమవడం లేదు."

"అంతలా నన్ను చూడాలని వుంటే ఆవిడే ఇక్కడికి ఓసారి రాకూడదూ?" అతని మాటల్లో చిరాకు స్పష్టం.

"నువ్వలాటి మాటలు మాట్లాడకు, ఎప్పుడైనా ఆ పల్లెటూరు వదిలి వచ్చిందా ఏనాటికీ? చిన్నతనంలో దేవుడే అన్యాయం చేశాడు – ఈ రోజున నీలాటివాళ్ళు ఇలా బాధపెడితే సహించక ఏం చేస్తుంది లే."

అతని తల్లి కళ్ళల్లో తడి. సెంటిమెంట్ కు దూరంగా వుండాలని అతని ప్రయత్నం.

"అంతగా చెబుతోంది గదా! పోనీ వెళ్ళి అమ్మమ్మనో సారి చూసిరా" అన్నాడు తండ్రి ఆఖరికి.

ఆ మధ్యాహ్నం మృణాళినినుండి ఉత్తరం వచ్చింది. అతనెంతో ఆతురతతో అందుకున్నాడు నీలం కవరు. లేత నీలంరంగు కాగితం. అందమైన కాగితం. అందమైన అక్షరాలు. మృదువైన పలకరింపులు. ఎప్పుడు వస్తున్నావని ప్రశ్న. తప్పక రావాలి సుమా అన్న హెచ్చరికతో కూడిన ఆజ్ఞ. ఆఖరున వ్రాసింది 'నీకు మా బెంగాల్ అంతా చూపించాము. మీ ప్రాంతం విశేషాలన్నీ వచ్చినప్పుడు చెప్పాలి!'

ఆ ఉత్తరాన్ని అంటివున్న మృదు

మైన సెంటు వాసనలాగే అతని మనసంతా గాలిలో తేలి ఆడి ది.

ఆ సాయంత్రం శేఖరం ఆ పల్లె టూరువెళ్ళి అమ్మమ్మని చూడ్డానికి ఒప్పుకొన్నాడు.

'వచ్చే సోమవారం బయలుదేరి వస్తున్నానని అమ్మమ్మకు ఉత్తరం వ్రాయండి'

ఆ అమ్మమ్మ అతనికి స్వయానా అమ్మమ్మ కాదు. తల్లి పినతల్లి. శేఖరం చిన్నతనంలో, అతని తండ్రి ఉద్యోగరీత్యా, ఐదారు నెలల కో వూరు బదిలీ అవుతూంటే, ఆ అమ్మమ్మ దగ్గరవుండి చదువుకున్నాడు-ఎనిమిదవక్లాసు దాకా. అత నిక్కడ వున్న న్నాళ్ళూ ఆవిడ అతన్ని చాలా ముద్దుగా, మురిపెంగా చూసుకొంది. లాలనతో పెంచింది.

అతనికి తన చిన్నతనం, ఆ ఊళ్లో చదువుకోడం అన్నీ సగం సగం జ్ఞాపికి వస్తున్నాయి. ఊరి చెరువులో ఈతలుకొడుతూస్నానం,విష్ణ్వాలయం లోని ధ్వజస్తంభం చుట్టూ తిరుగుతూ ఆటలూ, ఆలయంలో గన్నేరుపూలు ఏరడం, పూజారిపెట్టే ప్రసాదానికి చేతులు చాచడం, గుళ్లో గంటలు కొట్టడానికి ఆత్రం, మునసబుగారి తోటలో మామిడికాయలు దొంగ తనంగా తీ‌డ‌గ... అన్నీ లీలగా గుర్తు కొస్తున్నాయి. ఆ చిన్న తనం ఆ పల్లెటూరు, ఆ వాతా వరణం... అన్నీ గొప్పగా వుండేవి. అలా తను చిన్నతనంలో ఫీల్ అయి నందుకు శేఖరానికి ఈనా డెందుకో చిన్నతన మనిపిస్తోంది.

శాస్త్రం, విజ్ఞానం పెరిగి, ప్రపంచమంతా అతివేగంగా మారి పోతున్న ఈ రోజుల్లో కూడా ఆ పల్లెటూళ్ళు ఎదగవనీ, ఎదగ డానికి ప్రయత్నించవని అత కి కోపం.

ఆ సోమవారం రైల్లో హాయిగా మొదటి తరగతి మెత్తలపై జారబడి అతడు మెత్తని మధురమైన ఊహల లోకి జారిపోయాడు ఈ పల్లెటూరి అనుభవం మృణాళి నికి చెప్పాలి. వింతగా చూస్తుంది-ఆ పెద్ద కళ్ళతో. ఆమె వ్రాసిన ఉత్తరం తీసు కొన్నాడు. ఆ నీలం కాగితం, ముద్దొచ్చే ఆ అక్షరాలూ, ఆ కాగి తాలు వెదజల్లే సన్నని, హాయైన పరిమళం అతన్ని ఏదో లోకాలలోకి తీసుకుపోతోంది.

ఆ సెంటే మృణాళిని వాడుతుంది. ఏ సెంటు అంటె చెప్పదు. పైగా తన వళ్ళే సెంటు ట ... ఎంత కొంటెగా మాసిందీ ఆ మాటఅని...

అతనికి మెళుకువ వచ్చే సరి కి నాలుగైంది. నాలుగున్నరకు అతను దిగే స్టేషను వచ్చింది.ఆ చలిగాలిలో అతను ఆ స్టేషనులో చాలా చిరా కుగా దిగేడు.

ఈ చీకట్లో చలిగాలిలో ఇంకా ఆరుమైళ్ళు పోవాలి ఎలాగో?

అతనికి చాలా చిరాకుగాఉంది.

అందుకే ఈ పల్లెటూళ్ళ ప్రయాణమంటే అతని కంత మంట.

'బండి తెచ్చేను బాబూ! ఎల్దామేటి?'

చూసేడు. ముసలితనం గూడు కట్టిన ముఖం.


'నాను సుబ్బన్నని బాబూ! మర్చిపోనారేటి? అమ్మమ్మగోరు మీరొత్తున్నారని బండంపారు'

ఎలా వెళ్ళాలా అని మథనపడుతున్న శేఖరానికి ఆ మాట హాయిగా వినిపించింది.

బండిలో సామాను పెట్టి, అతను ఎక్కాక బండి కదిలించాడు సుబ్బన్న. ఊరు దాటాక చలి ఎక్కువైంది. శేఖరానికి వణుకు లాటిది వచ్చింది.

'చలెత్తే ఆ రగ్గు కప్పుకోండి బాబూ! అమ్మమ్మగోరు ఇచ్చారు. ఆ మూల చాప కింద ఎట్టాను. మీకు సుఖంగా వుంటానికి బండిలో పరుపు కూడా ఏయించినారు అమ్మమ్మగోరు మీ కోసం మహా చూత్తుండారు లెండి, మీరొత్తున్నారని పెళ్ళంత అడావిడీ సేత్తున్నారు' అన్నాడు సుబ్బన్న.

రగ్గు కప్పుకొన్నాడు. వెచ్చగా వుంది. బండి గతుకుల బాటమీద పోతోంది అతనికి మళ్ళా చిరాకు కలిగింది సుబ్బన్న మధ్యమధ్య ఎద్దుల్ని అదలిస్తూ, చిన్నగా ఏదో పాట పాడుతున్నాడు. ఎద్దుల మెళ్ళో మువ్వల చప్పుడు వింతగా వుంది. నక్షత్రాలు ఆకసంనిండా పువ్వులు పరుచుకొన్నట్టుగా వున్నాయి అవి



ఒక్కొక్కటి కరిగిపోతున్నాయి. క్రమంగా తూరుపున తెల్లబడు తోంది. అతనికి పైకి చెప్పుకోడానికి ఇష్టంలేకపోయినా ఆ వాతావరణం, ఎద్దుల మెళ్ళో మువ్వల శబ్దాలూ, ఆకాశంలో అయాచితంగా లభిం చిన అద్భుత దృశ్యం అతనికి చాలా మనోహరంగా వుంది. సూర్యోదయ సమయం ఇంత ఆహ్లాదంగా వుంటుందా అనిపించింది—ఈ మధ్య ఎన్నడూ, ఆ అనుభవం లేని శేఖ రానికి. నెమ్మదిగా అతడు పరుపు మీద వాలాడు. వెచ్చగా, వళ్ళంతా రగ్గు కప్పుకొన్నాడు. మగతగా ఆకసంలో మార్పుల్ని వింతగా, అప్రతిభుడై చూస్తున్నాడు. అతనికి నిద్ర పట్టింది. మెలుకువ వచ్చేటప్పటికి ఇంటిముందు బండి ఆగివుంది. ఖద్దకంగా లేచి బండి దిగాడు. ఎదురింటివాళ్ళు అతన్నే గుచ్చి, గుచ్చి చూస్తున్నారు.

ఇంట్లోకి వెళ్ళాడు. 'కాఫీ'కోసం మారాం చేస్తోంది ప్రాణం. అది తాగితేకాని అతనికి పనులేవీ జర గవు. ముఖం కడుక్కోడానికి వేడి నీళ్ళందించి'అమ్మమ్మగారు పూజలో వుండారు' అన్నాడు సుబ్బన్న. ముఖం కడుక్కొన్నాడు.

'కాఫీలాటి దేదైనా దొరుకు తుందా ఈ ఇంట్లో' అన్నాడు.

'అదేటంకోయ్! మీ రొత్తున్నా రని పట్నంనించి పెసల్ కాపీ పొడరు తెప్పిస్తే అమ్మమ్మగారు' ఫ్లాస్కువంచి కప్పులో అందించాడు.

'ఇది ఎంతఘోరంగావుంటుందో'. అనుకుంటూ తాగేడు. ఒక్క 'సిప్' తోనే అతనికి ఆశ్చర్యం కలిగింది' చాలా బావుంది కాఫీ. రెండో కప్పు పోసుకుతాగేడు. ఆ తర్వాత అతనికి కాస్త ప్రాణం వచ్చినట్టు అనిపించింది. చాలా ఉత్సాహంగా చుట్టూ చూశాడు. ఈసారి మరీ ఆశ్చర్యపోయాడు.

ఆ గది అలంకరణ చాలా 'నీట్'గా వుంది.

'మీ రొత్తున్నారని కరణం గోరింటినించి రేడియో తెప్పిం చారు. చదువుకోనానికి పట్నంలో సదూతూన్న ఎంకట్రాజుగారి చిన్న బ్బాయిగోరి పుస్తకాలు తెప్పించారు. ఆ ఫ్లాస్కు, కుర్చీలు పట్నంనుండి నానే కొని తెచ్చినా' అన్నాడు సుబ్బన్న.

ఎదురుగుండావున్న గదిగుమ్మానికి గాజు పూసలతో కూర్చిన జాలరి వుంది. రకరకాల పూసలు-చాలా బావున్నాయి. ఆ గదదగ్గరకొచ్చి ఆ జాలరి ముట్టుకొన్నాడు. పూసలన్నీ కదిలాయి - కదుల్తూ చిన్న, చిన్న శబ్దాలు. ఎండపొడపడి గాజు పూసలు మెరుస్తున్నాయి.

ఇంతలో అతని అమ్మమ్మవచ్చింది. అతన్ని చూడగానే బిళ్ళల్లాంటి ఆ కళ్ళు గప్పున వెలిగాయి.

'వచ్చావా బాబూ!'

మంచి కాఫీ తాగిన ఉత్సాహం అతన్నింకా వదల్లేదు.

'ఇంత బాగా కాఫీ చేయడం ఎప్పుడు నేర్చుకొన్నావ్ అమ్మమ్మా?' అన్నాడు, సిగరెట్ వెలిగిస్తూ.

'నాకేం వచ్చురా బాబూ! మన సావిత్రి కాచింది' అంది ఆవిడ.

'అలాగా!'

మధ్యాహ్నం భోజనం చేస్తూండగా అడిగింది ఆవిడ 'నువ్వు ఏదో విదేశాలకు వెళ్ళావుగదా–ఎక్కడకు బాబూ'

'స్టేట్స్, వెళ్ళానమ్మమ్మా'

'మరి మన సావిత్రి నువ్వు అమెరికా వెళ్లావంటుం దేవిటీ? దానికి మాత్ర మేం తెలుసులే'

అతను నవ్వుకున్నాడు.

భోజనం చేసి గదిలోకి వస్తుంటే ఆ గది పక్క గుమ్మం నుండి ఎవరిదో చీరకొంగు మాయమవడం చూశాడు. గదిలో ఆకులు, వక్క పొడి సిద్ధంగా వున్నాయి. తాంబూలం వేసుకున్నాడు. ఊల వేసుకుంటూ అద్దంలో చూసుకున్నాడు. పరుపుమీద పాల నురగలాటి తెల్లని దుప్పటి ఆహ్వానిస్తోంది. దిండుగలేబు మూలలో కుట్టిన తుంటేలు బావుంది. అతను నిద్రపోయాడు.

లేచేటప్పటికి సాయంత్రమయింది. కాఫీతాగి, పెరట్లోకి వెళ్ళాడు. తులసికోట గుబురుగా పెరిగింది. తులసికోటకు నీళ్ళుపోస్తున్న బలమైన, వయసులో వున్న చేతులు. మొహం సరిగా కనబడలేదు. చీరకొంగు దోపుకోడం వల్ల పచ్చగా, బలంగా కనిపిస్తూన్న పాదాల పై భాగం. అతనికి మృణాళిని సున్నితమైన చేతులు, ఆ చీకటి రాత్రి తన మెడ చుట్టూ పెనవేసుకున్న ఆ చేతులు, ఉద్రేకంతో మెరిసే ఆ కళ్ళూ, జేగురించిన చెక్కిళ్ళూ, ఆ ఎర్రటి పండులాటి పెదాలపై తన పెదాలు... జ్ఞాపకం వస్తున్నాయి.

'వెళ్ళాలి ... వెంటనే కలకత్తా వెళ్ళిపోవాలి. ఆ సున్నిత మయిన చేతుల బిగిలో వుండిపోవాలి. తల్లీ, తండ్రి, అమ్మమ్మ వీళ్ళంతా 'అనాడీ' లు. తన విజ్ఞానానికి, శాస్త్ర పరిజ్ఞానానికి పదును పెట్టి మానవ

---

● *ఒక కొత్త రచయిత షాని తన నాటకం విని ఎలావుందో చెప్పమని చంపుకుతిన్నాడు. షా సరే నన్నాడు. మొదటి అంకం పూర్తయి రెండో అంకం మొదలుపెడుతుండగా షా నిద్రఆవుకోలేక కళ్ళుమూసి గుర్రుపెడుతున్నాడు. రచయిత షాని లేపి "అభిప్రాయం చెప్పమంటే వినకుండా నిద్రపోతున్నారే" మన్నాడు.*

*"నిద్రపోవడమే నా అభిప్రాయం" అన్నాడు షా.*

జాతి అభ్యుదయానికి బాటలు వేయాలి.

తులసి కోటకు నీళ్ళు పోస్తున్న ఆమె అటు పక్కగా వెళ్ళిపోయింది. కుతూహలం కలిగింది.

'ఇంట్లోకి వెళ్ళి 'తులసి కోటకు నీళ్ళు పోస్తున్న దెవరమ్మమ్మా ?' అన్నాడు.

'అప్పుడే మర్చిపోయావటరా! మన సావిత్రి- చిన్నప్పుడు నీతో ఈ ఊళ్ళో ఆడుకున్న పిల్ల. మన స్వామి గారి అమ్మాయి...'

సావిత్రి ... సావిత్రి ... అతనికి ఓ రూపం మసగ్గా జ్ఞప్తిలోకి వస్తోంది... వచ్చేసింది.

ఆ రూపం ఆకారం స్పష్టమవగానే అతని ఊపిరి జ్వరం వచ్చిన వాళ్ళా అయిపోయింది. అతని దేహమంతా మంటలు లేచాయి. బలహీనుడి కోపంలాటి కోపం అతనిలో రగులుతోంది.

'ఇక్కడెందుకుంది ?' అతని గొంతులోని కర్కశానికి అవిడ తలఎత్తి ఖంగారుగా చూసింది.

'ఇంకెక్కడుంటుందిరా! పెళ్లా అవలేదు, వాళ్ళ నాన్న పెద్ద కట్నాలా ఇవ్వలేడు. నువ్వు వస్తున్నావని, పక్కిల్లేగదా అని నేనే సాయంరమ్మన్నాను. ఇల్లంతా సర్ది, వంటంతా చేసి...అంతా అదే చేస్తోంది. ముసిలిదాన్ని నేనేం చెయ్యగలను ?'

అతన్ని ఎందుకో చేతగాని, చేవలేని అసహనం చుట్టు ముడుతోంది. అక్కడ నిలవలేక గది దగ్గరకొచ్చి గాజు పూసల జాలరి కదిలిస్తూ, ఆలోచన మళ్ళిద్దామని ఎంతో ప్రయత్నించాడు.

అయినా చిన్నప్పుడు తనతో ఆడి, కవ్వించి, గంతులు వేసిన సావిత్రి రూపం కళ్ళముందు రూపు కట్టింది. ఆ రూపంతో అతనికి చిక్కు లేదు. ఆ చిన్నప్పటి సావిత్రి పెరిగింది ... వయసుతో లావణ్యాన్ని తెచ్చుకొంది. ఓణీ వేసుకొని, పెద్ద కళ్ళతో, తనని కవ్వించిన ఆమోటు పెదాల సావిత్రి ... ... ఆ రూపం మాత్రం అతన్ని ఇరుకునపెట్టి, చిరాకు పెడుతోంది. ఏ మూలో అణిచివేసిన, మరిచిపోయిన, ఉపయోగంలేని చిన్నతనపు చేష్ట... అది జ్ఞప్తికొచ్చి అతని వంట్లో సెగలు రేగుతోంది.

...చాలా కాలానికి, ఆనర్స్ చదివే రోజుల్లో, వేసవి సెలవుల్లో, మళ్ళా ఆ ఊరు వచ్చాడు. ఓణీ బిగించి, సిగ్గుపడుతూ, పట్నవాసపు అలవాట్లని రంగరించుకున్న అతనిని సావిత్రి చూసింది.

రమ్మంటే దగరకు వచ్చింది.

'మర్చిపోయావా ?' అన్నాడు.

'లే' దన్నట్టు తల ఆడించింది, చెవి రింగులు గమ్మత్తుగా ఊగాయి.

'అంత భయమెందుకు ?' అన్నాడు.

పెద్ద కళ్ళతో చూసి, తల దించు కొంది.

'అంత సిగ్గెందుకు?'

ఆమె బుగ్గలలో లోతుగా పడిన సొట్టలు అతన్ని నిలవనివ్వలేదు. చామన చాయరంగులో మెరుస్తూ, వళ్ళంతా తళుకు అద్దినట్టుగా ఉంది ఆమె. వయసులో ఉన్న ఆ పిల్ల తనకళ్ళకి 'ఆమె'గా కనబడింది.


అక్కడున్నన్నిరోజులు ఆమెను మచ్చిక చేసుకుందామని ప్రయత్నించేడు. ఉండేరోజులు పొడిగించాడు.

మళ్ళా వేసవి సెలవులకు పరిగెట్టుకు వచ్చాడు. ఈసారి ఆమె అతని కళ్ళకి మరీ వింతగా కనిపించింది. చీర కట్టింది ... చీరలో మెరిసింది. ఆ కళ్ళని తాకాలని, ఆ చెక్కిళ్ళను నిమరాలనీ అతనికి వుంది.

ఆమె దూరంగా కూర్చునేది. విహ్వలత్వంతో అతని కబుర్లు వినేది.

రెండు రోజుల్లో అతను వెళ్ళిపోవాలి. ఆ చల్లని సాయంత్రం ఆమె తలంటి పోసుకుని, చల్లని వెన్నెలలా వచ్చింది. దగ్గరకు చేరాడు. కోరికతో ఊగిపోయాడు.

కళ్ళని పొగిడాడు — కళ్ళని తాకాడు. చెక్కిళ్ళు గులాబీ రంగులో మెరుస్తున్నాయన్నాడు...



వెక్కిళ్ళు నిమిరేడు – ఆమె బెదిరి నట్టుగా దూరంగా వెళ్ళింది.

ఆమె దూరమైనకొద్దీ అతనికి ఆవేశం పెరిగింది. దగ్గరకు వచ్చాడు. ఆమె అధరాలు అదురుతున్నాయ్. మోటుగా కదిలే ఆ పెదాల్ని తన నోటితో మూసి వేసేడు. ఆమెను తనలో ఇముడ్చుకొన్నాడు. ఆమె వింతగా వణికింది. ఉన్నట్టుండి తప్పించుకొంది.

'తప్పు కాదా? నువ్విలా ... నేనెప్పుడూ అనుకోలేదు' ఆమె కళ్ళల్లో నీళ్ళు.

తనని అర్థం చేసుకోలేదని చిన్న బుచ్చుకున్నాడు. అతనిలో ఆవేశం లాంటిది పెరిగింది.

'ప్రస్తుతం తప్పేనేమో! కాని ... కాని ... నిన్ను పెళ్ళి చేసుకుంటాను. ఈ సంవత్సరంతో చదువయి పోతుంది–' అంటూన్న అతని చేతుల్లోంచి తప్పించుకొని హంసలా గాలిలో తేలిపోతూ పారిపోయింది. అతను వెళ్ళేరోజున ఆమె ఒక్క మాట మాట్లాడకపోయినా, ఆ పెద్ద కళ్ళల్లో ఎన్నో భావాలు నింపుకుంది.

వైజాగ్ వెళ్ళి ఉత్తరం వ్రాశాడు. 'ఫస్టుక్లాసులో ఫస్టున ప్యాసయాను. నాన్నగారితో! చెబుతాను – ఆయన నా కోరిక కాదనరు. త్వరలో ముహూర్తం – ఆ తర్వాత ఎలా పారిపోతావో చూస్తాను. జవాబు రాయాలి!'

అతనికి ఆమె జాబు వ్రాయలేదు. వ్రాసినా అతనికి అందిఉండేదికాదు. ఆ తరువాత అతను పైచదువులకు అమెరికా వెళ్ళాడు. ఏడేళ్ళు ఉన్నాడు. తన 'సబ్జెక్ట్'లో నిధి అనిపించుకొన్నాడు, ఈ ఏడేళ్ళ కాలంలో ఎన్ని అనుభవాలు? ఎందరో యువతులు, ఎన్నో రకాలు అన్నీ చవిచూశాడు. మనిషే మారిపోయాడు. తన విభాగంలోనే 'రిసెర్చ్' చేస్తున్న మృణాళినితో మూడేళ్ళ క్రితం పరిచయం.

గతం మరుగున పడింది.

ఆ గతమంతా ఈనాడు కళ్ళ ముందు నాట్యమాడుతోంది. అసహనం చెలరేగింది.

ఆ ఉత్తరం ఆమె దగ్గరే వుంది... బ్లాక్ మెయిల్–నో, నో – అటువంటివి వీళ్ళకు తెలీదు. అమ్మమ్మకు ఈ సహాయమెందుకు? ఇన్నాళ్ళూ ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?

---

● ఒక మతిమరుపాయన తన వీధి తలుపుకి పెంపుడు పిల్లి రావడానికి, పోవడానికి ఇబ్బంది లేకుండా వుండడానికి పెద్ద రంధ్రం ఒకటి వేశాట్ట. దాని పక్కనే వుంకో చిన్నసైజు రంధ్రం కూడా వేశాట్ట పిల్లి పిల్లల కోసం.

ఆమెతు పెళ్ళి కాకపోడం తన తప్పేంకాదు.

కోపంతో ఊగిపోయాడు.

గాజు పూసలతో గుమ్మానికి కట్టిన ఝాలరి అతని ఊపుకి ఊడి కింద పడింది.

చప్పుడుకు అతని అమ్మమ్మ వచ్చింది. తెగికిందికి జారిన ఝాలరి, వినురుగా వీథిలోకి పోతున్న మన వడూ కనిపించారు. ఆమె తెల్ల బోయింది. సావిత్రి వచ్చి తెగిన ఝాలరి సద్ది, విరిగిన పూసల్ని ఏరింది.

'గుమ్మానికి మళ్ళా కట్టావే సావిత్రీ' అంది ఆవిడ.

'పూర్తిగా తెగిపోయింది బామ్మ గారూ - ఇక నిలబడదు' అనేసి సావిత్రి పెరటిలోనికి వెళ్ళి పోయింది.

శేఖరం ఊళ్ళోకి వెళ్ళాడు. తెగ తిరిగేడు. ఊళ్లో తెలిసిన వ్యక్తులు పలకరించి ప్రశ్నలు వేశారు.

'ఏదో దేశ మెళ్ళావట గా? దొరసాన్ని చేసుకుంటావనుకున్నాం, లేదా? నేవిల్సు చూశారా? బ్రహ్మచారి ముదరకూడదయ్యోయ్ పంతులూ !'

వాళ్ళ మాటలు అతనిమీద అగ్గి మీద గుగ్గిలంలా పనిచేశాయి. బాగా చీకటిపడ్డాక తిరిగి వచ్చాడు.

'అన్నం తినుబాబూ' అని ముస లావిడ వడ్డించింది. అన్నం తింటూ 'మా సావిత్రి వెళ్ళిపోయిందా?' అన్నాడు.

'బాగా పొద్దోయింది కదూ - వాళ్ళమ్మ పిలిచిందని వెళ్ళింది. మర్చిపోయాను-మన సావిత్రి నాన్న గారు స్వామిగారు వచ్చారు ఇందాక'

'ఎందుకు? వాళ్ళ సావిత్రికి నన్ను సంబంధం వెతకమంటాడా?'

'అనలేదు గాని-వెతికితే తప్పేం కాదు. ఊరికే వచ్చాడు - నిన్ను చూద్దామని. పక్కింటివాడు, మంచి వాడు. నీకు చిన్నతనంలో పాఠం చెప్పిన పంతులుగారు కదా - నువ్వు ఎన్నో దేశాలు తిరిగి, పరీక్ష అయి, ఇంతవాడివయ్యావని విని, చూసి సంతోషిద్దామని వచ్చాడు. రేపో మాటు వాళ్ళింటికి వెళ్ళు'

అతనికీ వెళ్ళాలనే వుంది. వెళ్ళి ఆ సావిత్రిని గాయపరచాలనీ ఉంది.

మర్రోజు తమ ఇంట్లో సావిత్రిని పలకరిద్దామని చూశాడు. ఆమె తప్పించుకు తిరిగి ఇంటికి వెళ్ళి పోయింది. అతని కింకా మండి పోయింది.

ఆ సాయంత్రం స్వామిగారింటికి వెళ్ళేడు. వీధి గదిలో లైటు చిమ్నీ తుడుస్తోంది స్వామిగారి భార్య. అతనిని చూసి, కంటిమీద చేయాన్చి పరీక్షగా చూసి, గుర్తు పట్టింది.

'కూర్చోబాబూ' అంది లేచి నిలబడి.

అక్కడున్న ఒక చేయి విరిగిన కుర్చీలో కూర్చున్నాడు.

'మాష్టారు లేరాండీ?'

'లేరు బాబూ! ఊరెళ్ళారు. రేపు వస్తారు.'

అతని తండ్రి, తల్లీ, అక్కయ్యల కుశల మడుగుతోంది. అతను పరధ్యాన్నంగా సమాధానాలు చెబుతూ, సావిత్రికోసం వెతికాడు.

'కాఫీ తెస్తా'నంటూ ఆవిడ ఇంట్లోకి వెళ్ళింది.

ఆ సంజె చీకట్లోనే సావిత్రి కాఫీ గ్లాసు తెచ్చి అందించింది. సావిత్రిని చూడాలని అతనికి మహా ఇదిగా వుంది.


'అతన్ని చీకట్లో కూచోపెట్టావా? సంజె వేళ. నాకివతల చేయి తీరిక లేదు. హాల్లో దీపం పెట్టు సావిత్రీ?' వాళ్ళ అమ్మగారు వంటింట్లోంచి కేకేసింది.

సావిత్రి 'దీపం తీసుకొచ్చింది. గదిమధ్య వేళ్ళాడుతూన్న తీగకు తగిలించింది. ఆ లైటు వెలుతురుకు రాజుకున్న నిప్పులాగ ఆమె వదనం గప్పున వెలిగింది. చెంప, సగం వళ్ళూ కనబడుతున్నాయి. పక్కకే తిరిగి వుంది

'నన్ను మర్చిపోయావా?' అన్నాడు.

'కాఫీ తాగండి' అంది ఆమె ఇటు తిరిగి.

కాఫీ తాగుతూ ఆమెను చూస్తున్నాడు. పెద్ద కళ్ళు, మోటు పెదాలు, వాలుజడ, సగం మాసిన చీర, వదులుగా జాకెట్టు, చెంపన



మని - మృణాళిని 'బ్యూటీ స్పాట్' గుర్తుకొచ్చింది.

'నన్ను మరిచిపోయావా అన్నాను ?'

లోపలికి వెళ్ళబోతున్నదల్లా ఆగి, వెనక్కి తిరిగి 'నాన్నగారు ఊరు వెళ్ళారు' అంది.

'అంటే నన్ను వెళ్ళమనా అర్థం' కోపంతో ఊగిపోయాడు.

'ఎంతమాట! మీరు మా ఇంటికి రావడమే గొప్ప. మీ లాటివారిని సరిగా ఆదరించడమైనా చేయలేని వాళ్ళం—వెళ్ళమని చెప్పగలమా ?'

'మాటలు చాలా నేర్చావే'

'మాటలు కాదు. ఉన్న నిజం అన్నాను. మీకు తెలిసిన నాన్నగారు ఊరు వెళ్ళారు. తెలిసిన అమ్మ మాట్లాడి వంటింట్లోకి వెళ్ళింది. ఆమెకు ఓ గంటదాకా ఆ పని తెమలదు. ఇక ఈ సావిత్రి ఎవరో బామ్మగారు గుర్తు చేస్తేగాని గుర్తుకు వచ్చేది కాదుగదా !'

'నువ్వు చాలా మారిపోయావ్-ఎలా గుర్తుపట్టగలను? పెద్దదానవయిపోయావుగదా'

'అవును! చాలా పెద్దదాన్నయి పోయాను.'

'మీ నాన్నగారు ఎక్కడికి వెళ్లారేవిటీ?'

'మీరు అన్నీ తెలిసిన వారు. వయసువచ్చి, వయసు మీరి పోతూన్న ఆడపిల్ల ఇంట్లోఉండగా ఏ తండ్రయినా ఎండలో, అరిగిన చెప్పులు, బుజాన మాసిన ఖండువా వేసుకుని ఎందుకు ప్రయాణమవుతారో మీకు తెలియదా?'

అర్థమయినా ఆమె నోటి మీదుగానే సంగతి చెప్పించి హేళన చేయాలని ఉంది అతనికి.

'మీ పల్లెటూరు మాటలు నా కర్థమవవ్. ఎందుకు వెళ్ళారో ఈ పాత స్నేహితుడికి కొంచెం చెబుదూ'

'మా నాన్నగారికో పిల్లవుంది. ఇరవై నాలుగు సంవత్సరాలు వచ్చేశాయి. ఊళ్ళో వాళ్ళు పెళ్ళి చేయలేదని కాకులు పొడిచినట్టు పొడుస్తున్నారు. ఆ అమ్మాయి బావుంటుందని ఊళ్ళో వాళ్ళందరూ అనుకుంటూరు. ఏనాడో ఆ మాట ఆ అమ్మాయికే చెప్పి నమ్మించినవారూ వున్నారు. ఆ అమ్మాయికి పెళ్లి సంబంధం చూడటానికి వెళ్ళారు.'

'మరి ఇన్నాళ్ళూ ఆ అమ్మాయికి పెళ్లెందుకు కాలేదు ?'

'మీరు బాగా చదువుకొన్నవారు. సంస్కారం వున్నవారు. విదేశాలకు కూడా వెళ్ళి విజ్ఞాన ధనాన్ని పుష్కలంగా సంతరించుకొన్నారు. ప్రజ్ఞా పారమితులు—కనుక మిమ్మల్ని అడుగుతున్నాను—ఆ అమ్మాయికి కూడా ఆ సంగతే తెలీడంలేదు. కాస్త కారణం ఊహించి చెప్పరూ ?'

అతనికి మళ్ళా కోపం ముంచుకు వచ్చింది.

తిన చదువునూ, సంస్కారాన్ని ఎద్దేవా చేస్తోంది. దాగుడుమూత లనవసరం. తిన్నగానే 'ఎటాక్' చేయాలి.

"నీలో అన్నీ లోపాలే, చదువు లేదు. ఈ రోజుల్లో నీలాటిదాన్ని ఎవరు చేసుకుంటారు?"

"నేర్పిస్తే ఆడది నేర్వలేని విద్య లేదనిగా సూక్తి?"

"కావ్యాలు చదివావా? ఆ పాత చింతకాయ పచ్చడి ఎవడికి నచ్చుతుంది."

"అయ్యో! ఒక్క కావ్యాలనేవిటి. మీ రన్నట్టుగానే ఏ దెళ్ళ క్రితం ఓ పెళ్ళికొడుకు వచ్చి చూసి చదువు లేదన్నాడు. ఆ లోటు భర్తీచేయడానికి నాన్నగారు ఇంగ్లీషు నేర్పించారు. ఒకాయన హిందీ వచ్చా అన్నాడు. హిందీ విశారద ప్యాసయాను. ఒకాయన సంస్కృతం వచ్చా అన్నాడు.సంగీతం, చదువూ, ఇంగ్లీషు చదువు, సినిమాపాటలు, అత్తగారికి అధ్యాత్మ రామాయణ కీర్తనలూ అన్నీ నేర్పించారు. ఒకాయన డాన్స్ వచ్చా అన్నాడు. ఈ వయసులో గెంతడం బావుండదని వూరుకొన్నాను.ఏదో మీ దయవల్ల, డాన్స్ తప్ప, అన్నీ వచ్చాయ్."

"చదువు నేర్చినా సంస్కారం ఉండద్దూ? ప్రపంచం ఇంత వేగంగా మారిపోతోంటే, ఈ పల్లెటూరిలో కూపస్థమండూకంలాగ..."

"మీరు పాపం చాలా కాలంగా దేశంలో లేరు. మీకు తెలీదేమో ఈ పల్లెటూళ్ళన్నిటికీ రేడియోలు, పత్రికలూ, గ్రంధాలయాలు - అన్నీ వచ్చేయి. మా ఊళ్లో కొనుకు వెళ్ళి నెలకి ఇరవైనాలుగుసినిమాలుచూసే వాళ్ళూ, ముప్ఫయిదాకా ఎమ్. ఎ. ప్యాసయినవాళ్ళూ వున్నారు. ఐనా ఏ సంస్కారమైనా ముద్దుతో నేర్పితే, నేర్చుకుంటే అలవడదంటారా? విజ్ఞానులు కనుక అడుగుతున్నాను."

అతనికి మాటల్లో ఓడిపోతున్నానని తెలిసింది.

---

మునిలావిడ : మద్రాసు వెళ్ళేబండి ఏ ప్లాట్ ఫామ్ మీద నాయనా ఆగేది.

కూలి : ఎడంవైపుకి తిరగండి, సరిగ్గా కుడివైపు నుంటుంది!

ముని : ఏమిటోయ్! మరీ బడాయి! ఆ చెప్పేదేదో సరిగ్గా చెప్పు.

కూలి : అయితే సరే! మీ కుడివైపుకి తిరగండి, సరిగ్గా ఎడంవైపు నుంటుంది.

ఆమె బలహీనతలమీద దాడి చేయాలి.

'నీ కళలు అందంగా కనబడ్డం కూడా చేతకాదు. ఆ వదులు జాకెట్టు, ఆ మాసిన చీరా, ఆ జడా అలా వుంటే ఏ పెళ్ళి కొడుకూ మెచ్చడు, కోరడు'


'అయ్యో! మీరు పెళ్ళి చూపుల కొచ్చారని తెలీలేదు. మా కుటుంబ హితైషిగా వచ్చి కుశలమడుగుతున్నారనుకున్నాను. పెళ్ళి కొడుకుగా 'చూపుల' కొచ్చారని తెలిస్తే... ఒక్క ఐదు నిముషాలు ఆగరూ?—మా అమ్మ పెద్ద చీర, మా అమ్మకున్న ఆ ఒక్క బంగారు గొలుసూ, చెవులమీదికి జుట్టూ, నుదుటి ముంగురులూ... ఒక్క ఐదు నిముషాల్లో 'రెడీ' అయిపోతాను. అలవాటు మూలాన ప్రాక్టీస్ లేంది. ఏమంటారా?'

అతనిలో సెగలు రేగాయి.

టాపిక్ మార్చాలి.

'మీ నాన్నగారు వెళ్ళిన పెళ్ళి కొడుకెవరేవిటి?' అన్నాడు.

'ఈ ఏడేళ్ళబట్టీ నలభై ముగ్గురు యువకులు చూశారు నన్ను. వారందరికీ ఏదో ఒక వంక దొరికింది. ఆ వంకల వెనక వాళ్ళ మనసుల్లో పాపం ఎన్ని ఆశలు, ఆశయాలు ... మోటార్ సైకిళ్ళూ, రోలెక్స్ వాచీలు, పార్కర్ పెన్నులు, టెర్లిన్ సూట్లూ చాలా వున్నాయి ఆ అసలు నిజాలు మా నాన్నగారికి మొన్నటివరకూ తెలిసి రాలేదు. తెలియక ఏదో తంటాలు



పడ్డారు. నిజం తెలిసి తొక్కవలసిన బాట తొక్కారు. ఇక్కడికి ఇరవై రెండు మైళ్ళ దూరంలో ఓ వీథి నాలుగేళ్ళ పెళ్ళికొడుకు వున్నారట. వారికి ఈ మధ్యనే భార్యా వియోగమైంది. ఐదారుగురు పిల్లలు. వాళ్ళని సాకడానికి ఓ మనిషి కావలసి వచ్చింది. ఆ మనిషిని భార్యగానే తెచ్చుకోమని హితులు పట్టుపడితే, పాపం వారు చాలా అయిష్టంగానే ఒప్పుకొన్నారుట. అయన్ని చూసి, పిల్ల పెళ్ళి స్థిరపరుచుకు వద్దామని వెళ్ళారు"

ఆ మాటలు వినగానే అతని సంస్కారమంతా పైకి వెల్లువలా పొంగింది.

"నువ్వు ఒప్పుకున్నావా?" 'షాక్' అవుతూ అడిగాడు.

"ఈనాడు నేను ఒప్పుకోడం ప్రసక్తి వుందంటారా? ఓనాడు, చాలా ఏళ్ళక్రితం, ఒకరు కోరితే నేను ఒప్పుకున్నాను. వారికి ఆ విషయం తెలుసు. ఆ కథ చెప్పమంటారా?"

తనని ఎత్తిపొడుస్తోందని అతని మనసంతా కోపంతో ఘూర్ణిల్లింది.

లాభం లేదు ఈ యువతికి సానుభూతి చూపించ నవసరం లేదు,

"నీ కసలు బుద్ధిలేదు. నువ్వు ఉత్తి ఫూల్‌వి. ఎన్నో చదివి నేర్చుకున్నానంటావ్-ఆ మాత్రం స్వంతంగా, స్వతంత్రంగా ఆలోచించలేవా?"

"అయితే ఈ సంబంధానికి ఒప్పుకోవద్దంటారా?"

"నేనేమీ అనను. నీకు ఆలోచన లేదా అని"

"అదే నేననేదీను-మీలాంటివారు ఏమీ అనరు. చెప్పరు. ఇక ఏమీ తెలియని, ఓ పల్లెటూరు పిల్ల నిర్ణయించుకోవాలన్నమాట"

"ఇదే విదేశాల్లో అయితే జరుగుతుందా? నీలాంటి పరిస్థితే వస్తే, సంస్కారవంతమైన దేశాలలో, ఆ పిల్ల నచ్చినవాణ్ణి చేసుకుని తీరుతుంది. సాహసం కావాలి, మీ నాన్నగారు ఈ వయసులో ఇలా తిరగడానికి నీ అసమర్థతే కారణం"

"అందుకేకదా మీవంటి విజ్ఞుల సలహా అర్థిస్తున్నాను. కాని మీరిప్పుడు చెప్పిన సలహా పాటిస్తే ఈ ఊళ్లో దానిని లేచిపోడమంటారు. ఈ విషయాన్నే మన పట్నాలలో కాస్త నాజూకు పేరెట్టి క్లబ్బులో చెప్పుకొంటారు. కారణం నన్ను మెచ్చిన కుర్రాడు అందరి ముందూ పెళ్ళి చేసుకోడు. నా కళ్ళకి గంతలు కట్టి, ఊళ్లో వాళ్ళ కళ్ళు కప్పి లేవదీసుకు పోడానికి మాత్రం తయారు పోనీ మీ సలహా పాటించి ఆ పనే చేస్తాను. నన్ను లేవదీసుకుపోయే కుర్రాణ్ణి కాస్త చూసిపెట్టండి"

"మీ ఊళ్ళో ఎవరూ లేరా?" అన్నాడు కసి అంతటినీ ఆ మాటల్లో ఇముడుస్తూ,

ఆ అబల పెదవి పంటితో నొక్కిపట్టింది. కళ్ళల్లో నూకాల్లు నిలి

అతనికి దగ్గరగా వచ్చింది.

'ఉండకేం? ఉన్నారు. కాని ఎన్నాళ్ళ తర్వాత వదిలేస్తారా అన్న ఆలోచనే తెగకుండా వుంది. వదిలేయడం తథ్యం. వదిలేసిన తర్వాత ఎలాగూ మెడకు ఓ తాడు బిగించుకోవాలి. దానికి బదులు ఈ నాడే ఆ ముసిలాయన చేత శాస్త్ర గౌరవంగా మెళ్లో ఓ తాడు వేయించుకొని మూడుముళ్లూ బిగించుకుంటే మంచిదేమోనన్న మరో ఆలోచన, ఇంకో ఆలోచన కూడా వుంది. మా ఇంట్లో బంగారం, కరెన్సీ నోట్లూ లేకపోయినా నా మెడకు సరిపోయే తాడు ముక్కలు చాలా వున్నాయి.

ఊళ్ళో పెద్ద చెరువుంది. అలా చస్తే, చావడంలో కూడా పల్లెటూరు మోటుదనం అంటారు మీరు. అంచేత శాస్త్ర నాజూగ్గా చద్దామనుకుంటే మీలాంటి పట్నవాసపు స్నేహితుల్ని ఎవర్ని అర్ధించినా నిద్రమాత్రలో, సైనైడో దయతో తెచ్చి ఇస్తారు...'

ఉన్నట్టుండి ఆమెలో దుఃఖం పొంగింది. ఏడుపు దిగమింగుకోడానికి గొంతులో కొంగు కుక్కుకున్నా ఎగుపులు వస్తున్నాయి.

అతను తెల్లబోయాడు.

'మీ రంతా వట్టిమూర్ఖులు. పరిగెడుతూన్న జీవిత విధానంతో, శాస్త్ర పరిజ్ఞానంతో ముందుకు పోతూన్న ఈ ప్రపంచానికి పనికిరారు. అజ్ఞానం మీ సొత్తు' అన్నాడు.

'అజ్ఞానిని కాబట్టే అడుగుతున్నాను. నా సమస్య తేలలేదు. ఓ యువకుణ్ణి చూసుకొని లేచిపొమ్మంటారా? మా ఇంటి చిన్న గదిలో ఓ తాడు బిగించుకోమంటారా? లేక ఆ ఏభైనాలుగేళ్ళ పెళ్ళికొడుకుచేత మెడలో తాడు కట్టించుకొని, వారి కొడుకుల్ని, కూతుళ్ళని ప్రేమతో సాకి, భర్తగారిని భక్తితో పూజించి, చిరంజీవిగా జీవించి, అందరిచేతా 'ఓహో' అనిపించుకోమంటారా? నా ధర్మమేమిటో చెప్పి వెళ్ళండి'

ఆమె చూపునతడు తప్పించుకొని లేచి నిలబడ్డాడు.

ఆమెకు ఆవేశం కలిగింది.

అతడిని ఆపి, అతని గుండెపై వేలాని అడిగింది. 'నా ప్రశ్నకు బదులు చెప్పవలసిన బాధ్యత మీ మీద వుంది. మీ బాధ్యతని విదిలించుకొని పోవడం ఆత్మవంచన, నా ధర్మం ఏదో నాకు బోధించాలి. శిరసావహిస్తాను.'

ఆమె చూపులు నిప్పుల్లా వున్నాయి. ఆ సెగ అతన్ని కాల్చింది. అతని పని అయోమయమయి పోయింది. వెంటనే తెలివి తెచ్చుకొని. ఆమెను తోసేసుకొంటూ 'ఛీ' అంటూ వీధిలోకి మెరుపులా వెళ్ళిపోయాడు.

ఆ రాత్రే ఆ వూరు నతడు విడిచి వెళ్ళాడు.

● ● ●

పదేళ్ళ తర్వాత ప్రొఫెసర్ శేఖర్ ఆ అర్ధరాత్రి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచాడు. అతనికి భయంకరమైన కల వచ్చింది. అతని నుదురంతా చెమటపట్టింది. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

సావిత్రి కలలో కనబడింది. అతి భయానకంగా కనబడింది. మళ్ళా భయం కలిగింది.

ఎక్కడ వున్నానా అని చుట్టూ చూసుకున్నాడు. పక్క మంచం మీద మృణాళిని పువ్వులా పవళించి వుంది. ఆ గదిలో, నీలిరంగు కాంతిలో మొగలిపువ్వులా మెరుస్తోంది. ఎయిర్ కండిషన్డ్ గది హాయిగా వుంది. మెత్తటి పరుపూ, కింద కాశ్మీర్ కార్పెట్, అలవాటైన సుఖప్రదమైన పరిసరాలు అతని భయాన్ని పోగొట్టాయి. పక్కగదిలోకి వెళ్ళాడు. పిల్లలు సునీల్, కొబితా హాయిగా నిద్రపోతున్నారు.

అతనికి భార్యా, పిల్లల్నీ 'డిస్టర్బ్' చేయడం ఇష్టంలేక 'స్టడీ' లోకి వెళ్ళాడు. స్విచ్చి నొక్కాడు. పాల వెన్నెలలాటి కాంతి గదినంతా మృదువుగా కౌగలించుకుంది.

ప్రతి విషయం విజ్ఞానపరంగా ఆలోచించే ప్రొఫెసర్ శేఖర్ ఇన్నాళ్ళకు పదేళ్ళతర్వాతసావిత్రి ఎందుకు కలలోకి వచ్చిందా అని ఆలోచించాడు. ఈ పదేళ్ళ బట్టీ అతను తన వాళ్ళతోనే చాలావరకు సంబంధం తెంపుకున్నాడు. అవేపుకే వెళ్ళలేదు. మర్యాదకు చిన్నమైన ఉత్తరాలు మిగిలాయి. ఉన్నట్టుండి అతనికి కారణం తట్టింది. పొద్దుట తండ్రినుండి వచ్చింది 'మీ అమ్మమ్మ ఫలానా ౭వ తేదీన దివంగతురాలైనది 14 వ తారీఖున పదవరోజు, కాన తెలియపరచడమైనది' అని ఉంది ఉత్తరంలో. ఆ ఉత్తరాన్ని గురించి అతను అట్టే ఆలోచించలేదు. అయినా సావిత్రి కలలోకి వచ్చింది.

రేపు 'మళ్ళా ఫ్రాయిడ్' చదవాలి.

...సావిత్రి కలలోకి వచ్చింది. చాలా భీకరంగా కనిపించింది. సావిత్రి చచ్చిపడి వుంది. మొహమంతా వికృతంగా మారిపోయింది. కమిలిపోయిన రంగులో వుంది. ఆ రంగు వున్నట్టుండి 'గాఢీ' రంగులోకి మారుతోంది. చుట్టూ ముసలి భర్తా, సవితిపిల్లలూ వున్నారు.

వంట్లో నలత లేదు, వంటిమీద గాయాల్లేవు.

జబ్బులేదు, హత్యకాదు అన్నారు వైద్యులు.

కంఠంమీద మాత్రం సన్నని, నల్లని చారవుంది. ఆ చార, కలలో, అతనికి భీతిని కలిగించింది. ఇంకా గమత్తు—ఆ చార ఎవ్వరికీ కనబడ్డం లేదు, తనకి తప్ప.

తాళి కట్టుకున్న పచ్చని పసుపు

తాడు తన కంఠం చుట్టూ బిగిసి పోయిందని సావిత్రి ఏడుస్తూ నే చెప్పింది. ఆ మాటలూ, ఏడుపూ మిగతా వాళ్ళకి తెలిడం లేదు. ఆమె ఏడుపు భీతావహంగా వుంది. ఈ చావు పదేళ్ళ క్రితమే తానే తెచ్చుకుంటే తేడా ఏమిటంటోంది. తనకి తెలియడం లేదుట. చెప్పమంటోంది.

ఆమె తనతో నే మాట్లాడుతోంది.

ఆమె ఉన్నట్టుండి లేచికూర్చుని మెడలో తాళికట్టిన తాడు తీసి, వికృతంగా నవ్వుతూ తన మెడలోకి హారంలా గా విసిరింది. ఆ తాడు తన మెడని చిత్రంగా నొక్కుతూ, కంఠం బిగిసిపోతూవుంటే సావిత్రి భయానకంగా నవ్వుతూ నవ్వుతూ ఏడుపులోకి దిగి రోదిస్తోంది. ఆమె రోదన ఎక్కువైన కొద్దీ తన కంఠం చుట్టూ తాడు బిగుసుకుపోతోంది. అతనికి ఊపిరి అడనట్టూ, ప్రాణం పోతున్నట్టుగా ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

... అంతలో మెలకువ వచ్చింది.

ఆ కలను అతడిప్పుడు ఖాతరు చేయడు. టైము చూసుకున్నాడు. మణికట్టుంతా నిండిన వాచీ నాలుగు చూపిస్తోంది. వాచీలో తేదీ మారింది. 14 వ తారీఖు వచ్చింది.

ఇంకెలాగూ నిద్దుర పట్టదు. మృణాళినిని లేపడం ఇష్టం లేదు - రాత్రి క్లబ్బునించి పొపంఆలస్యంగా వచ్చింది. లేడీస్ క్లబ్ తరపున చందాలు వసూలు చేసి దస్సిపోయింది.

రేపు సైన్స్ కాంగ్రెస్‌లో అతడు చదవవలసిన పేపరు ఒకటుంది. ఎంతో విప్లవాత్మకమైన థియరీ ప్రతిపాదిస్తున్నాడు దాంట్లో. రేపు కలకత్తాకు మేధావులంతా వస్తున్నారు.

ఆ కాగితాలు ముందువేసుకుని కూర్చున్నాడు ప్రొఫెసర్ శేఖర్.

నిముషంలో అతని తీరు మారిపోయింది.

కంటికి జోడూ, వెనక్కి పోతూన్న జుట్టూ, విశాలమైన నుదురూ, సునిశితమైన బుద్ధీ, తీక్షణమైన పట్టుదలా-ప్రతిభావంతుడైన విజ్ఞాని అతడు. అతను చూపూ, ఆలోచనా అంతా ముందే వుంది. మానవ శ్రేయస్సుకోసం సర్వ జనావళి సుఖించేటందుకు నిరంతరం పరిశ్రమించే విజ్ఞాన కోవలోని వాడు.

అతనికి జేజేలు. జోహార్లు.

□□□